అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 28 ఆగస్టు 2023



## ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఓటరు జాబితాలో తప్పొప్పులు, ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డీఓ రాజేశ్వర్ బీఎల్‌ఓలకు సూచించారు. ఆదివారం సిర్పూర్ మండలంలోని పలు పోలింగ్ బూతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల వరకు ఓటరు జాబితాను ఎలాంటి తప్పొప్పులు లేకుండా చూడాలని, అలాగే నూతనంగా ఓటరు నమోదు చేయాలని, ఓటరు లిస్టులో వివరాలు సక్రమంగా ఉండే విధంగా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి తహసీల్దార్ లలిత, ఆర్ఐలు మోబినొద్దీన్, జుగాజిరావు, బీఎల్‌ఓలు ఉన్నారు.

## బాసర ఆలయంలో భక్తుల కోలాహలం

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వాసవి అమ్మవారిని దర్శించుకోడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన అక్షరాభ్యాస క్యూలైన్లు బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరపున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.8లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

# హస్తం టికెట్ దక్కేదెవరికో..?

- ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకు 54మంది దరఖాస్తులు
- ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురికి పైగానే పోటీ
- అభ్యర్థుల ఎంపికపై కొనసాగుతున్న సర్వేలు
- ఎవరికి లభిస్తుందోనని ఆశావహుల్లో ఉత్కంఠ
- త్వరలోనే వెల్లడికానున్న అభ్యర్థుల జాబితా

**రానున్న అసెంబ్లీ ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్య రసవత్తంగా జరగనున్నాయి. డిసెంబర్‌లో జరిగే ఈ ఎన్నికల కోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ సైతం గెలుపు గుర్రాలను బరిలో నిలిపేందుకు సమాయత్తమవుతోంది. ఈ సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. టికెట్లు దక్కించుకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. అసెంబ్లీ టికెట్ల కోసం ఆ పార్టీ చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ ముగిసిపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు ఏకంగా 54మంది ఆశావహులు టికెట్ల కోసం దరఖాస్తులు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేయగా.. మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల్లో ఒక్కో స్థానం నుంచి ముగ్గురు నుంచి పది మంది వరకు దరఖాస్తులు అందజేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సర్వే చేపట్టి గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏఐసీసీ నుంచి సర్వేలు ప్రారంభమైనట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు.**



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ ఇందుకు కార్యచరణ సిద్ధం చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక గడువు విధించి ఆశావహుల నుంచి టికెట్ల కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉండగా.. చివరి రోజు వరకు భారీగా దరఖాస్తులు చేరాయి. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కాంక్షతో ఉన్న కాంగ్రెస్ బలమైన అభ్యర్థులను ఎన్నికల సమరంలో దింపాలని యోచిస్తోంది. అభ్యర్థుల దరఖాస్తులను ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ పరిశీలన చేసి ఎంపిక చేసే అభ్యర్థులకు సంబంధించి సర్వేలు చేయించనుంది. సర్వేల సమాచారంతో పాటు వివిధ సమీకరణల ఆధారంగా టికెట్లను కేటాయించనుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వే సంస్థల నుంచి జిల్లాలోని పలువురికి ఫోన్లు కూడా వస్తున్నాయి. ఆయా నియోజకవర్గాల్లోని టికెట్ ఎవరికి కేటాయిస్తే బాగుంటుందనే సమాచారం తీసుకుంటోందని తెలుస్తోంది. వివిధ రకాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు గెలిచే అభ్యర్థులకే టికెట్లు దక్కే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. వీరిలో ఎవరికి టికెట్ వస్తుందోనని ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఫలాన వ్యక్తికి వస్తుందని ..మరొకరికి రాదని ఆ పార్టీలో చర్చలు జరుగుతున్నాయి.

**పది స్థానాలు..54మంది పోటీ..!**

కాంగ్రెస్‌లో ఈ సారి టికెట్ పొందడం కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలు ఉండగా వీటి పరిధిలో 54 మంది టికెట్ కోసం దరఖాస్తులు చేయడం గమనార్హం. బోథ్ నియోజకవర్గం నుంచి అధికంగా 11మంది దరఖాస్తులు చేయగా ఆదిలాబాద్‌లో 8మంది, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ నుంచి 6చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఆసిఫాబాద్‌లో 4 దరఖాస్తులు వెళ్లగా.. సిర్పూర్, నిర్మల్,ముథోల్‌లో మూడేసి చొప్పున దరఖాస్తులు అందాయి. మంచిర్యాలలో ఇద్దరు మాత్రమే టికెట్ కోసం దరఖాస్తులు చేశారు. ఇలా టికెట్ కోసం దరఖాస్తులు చేసిన నాయకులు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం పెద్దలను కలుస్తూ టికెట్ కేటాయించాలని అభ్యర్థిస్తున్నారు.

**దరఖాస్తులు చేసింది వీరే**

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి టికెట్ కోసం గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, కంది శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, మునిగెల నర్సింగ్, చరణ్‌గౌడ్, సంజయ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి దరఖాస్తులు అందించగా.. బోథ్ నియోజకవర్గం నుంచి ఆడె గజేందర్, వన్నెల అశోక్, డా.నరేష్‌జాదవ్, కొమురం కోటేశ్వర్, జాదవ్ వసంత్‌రావు, గోడం గణేష్, కొడప నగేష్, తొడసం దౌలత్‌రావు, జాదవ్ సుభాష్‌నాయక్, జల్కె పాండురంగ దరఖాస్తులు చేశారు. ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు,చారులత రాథోడ్, భరత్‌చౌహాన్, రాంకిషన్‌నాయక్, కిషోర్‌నాయక్‌తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ కూడా దరఖాస్తు చేసినట్లు తెలిసింది. నిర్మల్ నుంచి శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్‌లు దరఖాస్తులు చేయగా ముథోల్ నుంచి విజయ్‌కుమార్‌రెడ్డి, కుమ్రెవార్ కిరణ్‌కుమార్, ఆనంద్‌రావుపటేల్‌లు అప్లికేషన్ అందించారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు కే.వీ ప్రతాప్ అనే న్యాయవాది కూడా దరఖాస్తు అందించారు. చెన్నూరులో రామిల్ల రాధిక, దాసారపు శ్రీనివాస్, దుర్గం అశోక్, బోడ జనార్దన్, డా.రాజారమేష్‌బాబు, దుర్గం భాస్కర్, నూకల రమేష్ దరఖాస్తులు చేశారు. బెల్లంపల్లిలో గడ్డం వినోద్‌కుమార్, కాంపెల్లి ఉదయ్‌కుమార్, చిలుముల శంకర్, రొడ్డ శారద, చొప్పదండి దుర్గాభవాని, నేతారి స్వామి, ముడిమడుగుల మహేందర్‌లు దరఖాస్తులు చేయగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేష్, ఆజ్మీరా శ్యాంనాయక్‌లు శేషారావులు దరఖాస్తులు చేశారు. సిర్పూర్‌లో రావి శ్రీనివాస్, కొరెల్ల కృష్ణారెడ్డి, యూసుఫ్‌ఖాన్‌లు దరఖాస్తులు అందించారు. వీరిలో ఎవరికి టికెట్ దక్కుతుందోననే ఉత్కంఠ నెలకొంది. అధికార పార్టీ అభ్యర్థుల జాబితా వెల్లడైన నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా కూడా త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన దివ్యాంగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ వారికి రూ.4016 పెన్షన్‌ను అందిస్తోందని, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో భారి సంఖ్యలో దివ్యాంగులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో 3055 మంది దివ్యాంగులకు పెన్షన్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగుల ఇక్కట్లను పరిష్కరించి, వారికి అండగా నిలవాలని సీఎం కేసీఆర్ పెన్షన్‌ను మరో వెయ్యి రూపాయాలు పెంచారని గుర్తు చేశారు. అర్హులైన వారికి ఇండ్ల స్థలాల కేటాయింపుతో పాటు ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని భరోసా కల్పించారు. దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, వార్డు కౌన్సిలర్ మోబిన్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు మహ్మద్ మున్న, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, సలీం, సాజిదొద్దీన్, ఇమ్రాన్, అయూబ్ పాల్గొన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ కాగజ్‌నగర్ గురుకుల కళాశాలలో ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సంగీత ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్సీ విద్యార్థులకు 10, ఎస్సీ(సి) ఒకటి, ఓసీ ఒకటి సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటి కోసం ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 9553736386, 9985842503లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భీంపూర్ మండలం, నిపాని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేదోడ్కర్ సంతోష్ కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మెన్ ప్రముఖ హోమియోపతి నిపుణులు డాక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతోస్ కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావానికి అరుదైన గౌరవం దక్కిందని కొనియాడారు. అదిలాబాద్ జిల్లాకు గర్వకారణమని అన్నారు. అలాగే జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా విశేషమైన సేవలు చేస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ ఐదో తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సాయి వైకుంఠ ట్రస్ట్ డైరెక్టర్‌లు నవీన్ యాదవ్, మహేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆశన్న యాదవ్, స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి పెంటపర్తి ఊశన్న, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సతీష్ పాల్గొన్నారు.

## నవసమాజ నిర్మాణంలో తమ వంతు పాత్రను పోషించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో తమవంతు పాత్ర పోషించిన కాంట్రాక్టు అధ్యాపకుల ఆకాంక్షలను సీఎం కేసీఆర్ వారిని క్రమబద్ధీకరించారని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. కాంట్రాక్టు లెక్చరర్‌లను క్రమబద్ధీకరణ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం కృతజ్ఞత సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరు కాగా, అసోసియేషన్ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలక పాత్రా పోషించిన కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఇచ్చిన మాటకు కట్టుబడి వారిని క్రమబద్ధీకరించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. తమ చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ, నవసమాజ నిర్మాణంలో తమ వంతు పాత్రను పోషించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉన్నతికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం, జిల్లా అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, డీఐఈఓ రవీందర్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలో అసెంబ్లీ ప్రవాస్ యోజనలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ఆర్వి ఎమ్మెల్యే సందీప్ దుర్వే ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. స్థానిక రామ్‌లీలా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. అనంతరం టీటీడీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సందీప్ దుర్వే, జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలందరూ కలిసి కట్టుగా పని చేసి బీజేపీని ఆదిలాబాద్‌లో అధికారంలోకి తేవాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాలలో కేవలం ఓట్ల కొరకే దొంగ హామీలతో ప్రజలను మోసం చేయడానికే కంకణం కట్టుకుందే తప్పా ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. మూడో సారి మళ్లీ ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త హామీలతో ముందుకొస్తుందన్నారు. ఈ బీఆర్ఎస్ పార్టీ ప్రజలను ఏ రకంగా మోసం చేస్తుందో, ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, లాలా మున్న, జోగు రవి, సోమ రవి పాల్గొన్నారు.

# కేసీఆర్ మనసు మార్చుకోవాలి

- మంచిర్యాలలో దివాకర్ రావు ఓటమి తప్పదు
- బీసీలకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలి
- మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు




నవతెలంగాణ-హాజీపూర్

కేసీఆర్ మనసు మార్చుకొని మంచిర్యాల టికెట్ బీసీలకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ టికెట్ మార్పు లేకపోతే బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కోల్పోక తప్పదన్నారు. దివాకర్‌రావు ఓటమి చెంది ప్రేమ్ సాగర్‌రావు గెలిచే అవకాశం వుందని పేర్కొన్నారు. ఇంతటి వ్యతిరేకత ఉన్న కానీ దివాకర్ రావుకు టికెట్ కేటాయించడంపై మండి పడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రేమ్ సాగర్ రావు రౌడీ రాజకీయం తప్పదని హెచ్చరించారు. రెండు పర్యాయాలు దివాకర్‌రావు గెలుపుకు కృషి చేశానని చెప్పారు.

**బీసీలకు టికెట్ కేటాయించాలి**

ఏండ్ల కాలంగా నియోజకవర్గంలో అగ్రకులాల వారే రాజ్యం ఎలుతున్నారని, అధిక జనాభా గల బీసీలు అనగదొక్కబడుతున్నారని అన్నారు. ఈ సారి బీసీలకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీలలో ఒకరిని ఎంచుకొని ఓటర్ల దగ్గరనే తలో వంద రూపాయలు అడిగి మరీ బీసీల గెలుపుకు కృషి చేస్తానని ఉద్ఘాటించారు. టికెట్ మార్పు లేక పోతే సీటు పోవడం కాయమనని కేసీఆర్ టికెట్ మార్చక పోతే దివాకర్‌రావును ఓడించక తప్పదని హెచ్చరించారు.

## ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఎల్‌ఓలతో ఏర్పాటు చేయించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు కోసం ఆగస్టు 26, 27 తేదీల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని, అలాగే సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా ఓటర్ నమోదు పునరీక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటర్ లిస్ట్‌లో వివరాలు తప్పుగా ఉంటే సవరణ చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదేవిధంగా 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండబోయేవారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఓటర్ నమోదుతో పాటు ఓటుకు సంబంధించి ఇతర వివరాలు తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ 1950 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి పోచయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**రెబ్బెన :** మండలంలోని నంబాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుమ్మరి పెంటయ్య గుండెపోటుతో మరణించగా ఆయన దశదిశ కర్మకు హాజరైన జీడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి బాదిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని జర్నలిస్టు కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలనీ సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీలో మిగిలివున్న ప్రభుత్వ భూమిపై అధికార పార్టీకి చెందిన పలువురు నాయకుల కన్ను పడిందని వారు ఆరోపించారు. నేషనల్ హైవే రోడ్డుకు ప్రక్కన గల జర్నలిస్టు కాలనీలో ప్రభుత్వ భూమి ఉండడంతో అధికారుల అండదండలతో భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మండలంలో ఇప్పటికే పలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. జర్నలిస్టు కాలనీలో ఉన్న భవనం ప్రెస్‌క్లబ్‌కు కేటాయించారని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుండి ఒక కిలోమీటర్ దూరం ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు నాయకులు ప్రభుత్వ అండదండలతో కబ్జా చేయాలని చూస్తున్నా తహసీల్దార్ కార్యాలయం అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అర్హులైన జర్నలిస్టులకు భూమిని కేటాయించాలని వారు కోరారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతి పేద ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పూదరి సాయి, బాలునాయక్ పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుతోవ పట్టించేందుకే కోవర్టుల భూటకం

నవతెలంగాణ-రామకష్ణాపూర్

చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ కాంగ్రెస్‌లో కోవర్టులు ఉన్నారని, ప్రజలను తప్పుతోవ పట్టించేందుకే కొత్త భూటకం అడుతున్నాడని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ విమర్శించారు. ఆదివారం గద్దెరాగడిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద ర్యాలీలో కాంగ్రెస్‌లోనీ ఎమ్మెల్యే అభ్యర్థులునా వారే, నేను పంపిన వారే, మళ్ళీ తిరిగి వస్తారు అని చేసిన వాఖ్యాలను తీవ్రంగా కండించారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చిన్న వయస్సు, మతిస్థిమితం లేక పిల్ల మాటలు మాట్లాడుతున్నాడని, రాజకీయ సమాజ జ్ఞానం వయస్సు పెరిగితే వస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రత్యర్థిపై ప్రజా ఆదరణ తో, ఓటు బ్యాంకుతో గెలిచే సత్తా లేక కాంగ్రెస్‌లో కోవర్టులు వున్నారని, ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ చెన్నూరు అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం నియోజకవర్గంకు వచ్చిన బాల్క సుమన్ నియోజకవర్గంలో ఈ సారి గెలుపు అసాధ్యం అని ముందుగానే గ్రహించి కాంగ్రెస్ కూడా తనదే అని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ కూడా తనదే, తన వాళ్ళదే అని చెప్పుకునే స్థాయికి సుమన్ దిగజరుతారని ప్రజలు ఊహించలేదని ఇప్పటికైనా నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందని సుమన్ గ్రహించడం హర్షించ దగిన విషయం అన్నారు. చెన్నూరులో కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయించిన ఐక్యంగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేస్తాం అని తెలిపారు. ప్రచారంలో కూడా నిజాలు చెప్పే ధైర్యం లేని సుమన్ ఎన్నికల అనంతరం ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

## గూడెం గోదావరి నదిలో దూకి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

జైపూర్ మండలం సర్వ గ్రామానికి చెందిన దూట అజిత్ కుమార్ 17 అనే యువకుడు మానసిక స్థితి బాగా లేక గూడెం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అజిత్ కుమార్ తన స్నేహితుడి జన్మదిన వేడుకలు ఉన్నాయని ఇంటి నుంచి బయలుదేరాడు. చీకటి పడిన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అజిత్ కుమర్‌కు ఫోన్ చేయగా నేను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికిన జడ తెలియలేదు. ఆదివారం ఉదయం గూడెం గోదావరి వంతెనపై తన ద్విచక్ర వాహనం గమనించిన కుటుంబ సభ్యులు గోదావరి నదిలో అజిత్ కుమార్ మృతదేహం లభించింది. ఈ మేరకు మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

## ఘన్‌పూర్‌లో అన్నాభావు సాఠే జయంతి వేడుకలు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని ఆదివారం అన్నాభావు సాఠే 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు లఖన్ అశోక్ పాల్గొన్నారు.

**నార్నూర్:** నేటి యువత సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగు జాడల్లో నడిచి ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ జాదవ్ సుజాత పరమేశ్వర్ అన్నారు. ఆదివారం బేతాల్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామంలో అన్నాభావు సాఠే జయంతిలో పాల్గొని మాట్లాడారు. ముందుగా అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పల్మటే కిరణ్, సూర్యవంశీ పండరి, వాగ్మారే వామన్‌రావ్, రంగారావ్, అరవింద్, గ్రామ పెద్దలు కిషన్ సింగ్ నాయక్, సోహన్ సింగ్, విష్ణు పాల్గొన్నారు.

## ఉమెన్ సేఫ్టీ సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-సారంగాపూర్




మండలంలో చించోలి(బి)లోని హరితవనంలో సోఫీనగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు ఆదివారం ఉమెన్ సేఫ్టీ సెక్యూరిటీ, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై షీటీం ఎస్సై సుమాంజలి అవగాహన కల్పించారు. ఎలాంటి సమయంలోనైనా బాలికలకు ఎలాంటి ఇబ్బంది కల్గిన 100, 1098, 1930కి డయల్ చేయాలని సూచించారు. అలాగే సెల్ నెంబర్ 8712659550 కు కాల్ చేయాలని వెంటనే షీటీమ్ స్పందించి మిమ్మలను కాపాడుతుందని వారికి బరోసా కల్పించారు. ఈ కార్యక్రమం కానిస్టేబుల్ రమాదేవి, రాధిక, హోమ్‌గార్డ్ రమాదేవి పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యారంగ సమస్యలు, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సెప్టెంబర్-1న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుగుణ, గణేష్ అన్నారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూడు దశల పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చామని అన్నారు. ఇప్పటి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. సెప్టెంబర్-1న తలపెట్టిన రాష్ట్రస్థాయి మహాధర్నాను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సీఎం కేసీఆర్ బాటలోనే నడుస్తా..



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడి సాధించిన సీఎం కేసీఆర్ బాటలోనే నడుస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం పల్సి(బి) తండాలో నారాయణ బాబా ఆలయ ఆవరణలో కొత్తగా నిర్మించ తలపెట్టిన షెడ్ నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో అత్యధిక సీట్లు బీఆర్ఎస్ గెలిచి ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ కావాలని అన్నారు. కార్యకర్తలు రాబోవు ఎన్నికలలో సైనికులుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంగూర్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, కన్వీనర్ తోట వెంకటేష్, మండల రైతు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, రాజేశ్వర్, నాగారెడ్డి, సత్యనారాయణ, బల్వంత్‌రావు, జాదవ్ కిసాన్, గంగాధర్, సుధాకర్, గిసా మల్లయ్య, శంకర్, నర్సింలు, ఆశన్న యాదవ్, వెంకన్న, శాస్త్రి, గజానన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ చంటి మాతృమూర్తి, పల్సి గ్రామానికి చెందిన ఫకీరా జాదవ్ భార్య ఇటీవల మరణించిందని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించారు. మండల పర్యటనలో భాగంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేష్, స్థానిక సర్పంచ్, అంగూర్, జాదవ్ కిషన్, ఉపసర్పంచ్ బల్వంత్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జీవన్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మగ్గిడి ప్రకాష్, అబ్దుల్లా, గంగాధర్, వెంకన్న, ఆశన్న యాదవ్, తోట ప్రమోద్, ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని రణదీవేనగర్ లో ఆదివారం సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే 103వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ సాహిత్య రంగానికి అన్నాభావు సాఠే చేసిన సేవలు మరవలేనివని అన్నారు. మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా కృషి చేయాలనీ సూచించారు. సమాజ హితం కోసం పాటు పడిన వారి జీవిత చరిత్రను నేటితరం స్ఫూర్తిగా తీసుకుంటూ, ముందుకు సాగాలన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మూడు నెలల్లో అధికారంలోకి వస్తుందని రెండు లక్షల రుణమాఫీ, అలాగే మహిళలకు రూ.500లకు సిలిండర్ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, భూషణ్, సౌధాలు, రాజన్న, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటి, ఇస్రు పటేల్, సాయిలు, నర్సయ్య, వెంకటేష్, మోరే నర్సయ్య పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించే దిశగా చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో బాషా సాంస్కృతిక శాఖా సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద సంబరాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జానపద సంబురాల్లో భాగంగా పలువురు కళాకారులను శాలువా, ప్రశంస పత్రాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ జానపద కళాకారులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే జోగు రామన్న కృషి చేస్తున్నారని అన్నారు. జానపద కళాకారుల ప్రదర్శనల కోసం ఆడిటోరియం నిర్మాణానికి స్థల కేటాయింపు సైతం జరిగిందని, త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్వో విష్ణు వర్ధన్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్‌లతో పాటు సంఘం ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- సెప్టెంబర్ 1న మహా ధర్నా
- సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు సెప్టెంబర్1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఏ వెంకట్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశల పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చిమని, ఈ నేపథ్యంలో జులై నెలలో మండల స్థాయిలో ఆగస్టు12న జిల్లాస్థాయి నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో సెప్టెంబర్-1 తలపెట్టిన రాష్ట్రస్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ, అనేక సమస్యలను పెండింగ్‌లో ఉంచడం సరి కాదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మొదటి వేతన సవరణలో దాదాపు మూడు సంవత్సరాల కాలాన్ని వృధా చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను దారుణంగా మోసం చేసారని అన్నారు. జులై నెలలో నూతన వేతన సవరణ కమిటీ(పీఆర్సీ) కమిటీ వేయాల్సి ఉండగా ఇదిగో అదిగో అంటూ వాయిదా వేయడం సరికాదని అన్నారు. వెంటనే వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ను నియమించి ఐఆర్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ వేయాలని, జులై 1 నుండి మధ్యంతర భృతి మంజూరు చేయాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను, బోధనేతర పోస్టులను నియమించాలన్నారు. అలాగే గురుకుల విద్యాసంస్థల్లో ఏకరూప పాలన అమలు చేయాలని గురుకులాలు, కేజీబీవీ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు కొమ్ము రమేష్, జాదవ్ వెంకట్‌రావు, భుజంగరావు, జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు ఏ.స్వామి, వి.అశోక్, బి.రమేశ్వర్, సుగుణ, ఎండి రియాజ్, సంఘ బాధ్యులు లక్ష్మణ్‌రావు, సూర్యకుమార్, కిష్టన్న, శ్రీనివాస్, శివన్న, శంకర్, విలాస్, గణేష్ పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేంత వరకు ఉద్యమం కొనసాగిస్తాం



నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గమైన బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ గత 43రోజులుగా రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని సాధిఖానాలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి, అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యుడు పసుల చంటి మాట్లాడుతూ గత 43 రోజులుగా రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయని అన్నారు. వివిధ రకాలుగా వినూత్నంగా నిరసనలు తెలుపుతున్నామని అన్నారు. భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్షం నాయకులతో పాటు వివిధ ప్రజాసంఘాలు, మేధావులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వివిధ కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించామని అన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. హామీలు వద్దని అధికారిక ప్రకటన కావాలని అన్నారు. ప్రభుత్వం ఒక వేళ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రకటనను చేయకపోతే రానున్న ఎన్నికలలో బోథ్ నియోజకవర్గం నుంచి సుమారు 200 మందితో ఎమ్మెల్యే పదవికి నామినేషన్లు వెయిస్తామని అన్నారు. ఉద్యమం తీవ్రతను సైతం పెంచాలని, ఈ క్రమంలో ఆమరణ నిరాహారదీక్షలను చేపట్టాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీలు, ప్రతి కుటుంబానికి రెవెన్యూ డివిజన్ అవసరాన్ని తెలిపే కరపత్రాన్ని అందించాలని అన్నారు. జాతీయ రహదారి-44పై నిరసన చేపట్టాలని, అవసరమైతే హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ధర్నా చేపడుతామని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటన చేసేవరకు రిలే నిరాహారదీక్షలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

**రెవెన్యూ డివిజన్ పోరాటానికి సంపూర్ణ మద్దతు : ఏఐకేఎస్**

మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ సాదన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 43వ రోజుకు చేరింది. అల్ ఇండియా కిసాన్ సభ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక దేవిదాస్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి తరలిపోయిన కార్యాలయాలను బోథ్ కేంద్రంగానే ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి పరిశోధనకు ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి అధ్యయనం, పరిశోధనకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన నిమిత్తం అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధ్యయనం, పరిశోధనలో భాగంగా 14 మంది సివిల్ సర్వీస్ అధికారులు నేటి నుంచి సెప్టెంబర్ 3 వరకు 2 బృందాలుగా జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలనీ అధికారులకు సూచించారు. సివిల్ సర్వీస్ అధికారులు జిల్లాలోని గ్రామీణ ప్రజల జీవన విధానం, గిరిజన సంస్కృతి, ఆచార పద్ధతులు, గిరిజన కళలు, జీవనోపాధి తెలుసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ ప్రాంతాలలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనులు, పరిసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆదిలాబాద్ వంటి జిల్లాలో క్షేత్ర పర్యటన అధికారుల సర్వీస్‌కి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరి సంస్కృతి, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వ్యవసాయం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధికి జాబ్ మేళాల నిర్వహణ, అటవీ హక్కు చట్టం అమలు, గిరివికాసం వంటి పథకాలపై వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, డీఆర్డిఓ కిషన్, డీఈఓ ప్రణీత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్



నవతెలంగాణ-కడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 29న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కారించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల సీఈఓగా పనిచేస్తోందని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, క్యాజువల్ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని అన్నారు. బీడీసీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ అమలు చేయాలని, మోటార్, హమాలి రంగాలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్, యూఆర్ఎస్, మైనార్టీ విద్యాసంస్థల కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కనీసం రూ.26 వేలు వేతనం అమలు చేయాలని అన్నారు. బీడీ కార్మికులకు కనీస వేతన జీఓ ప్రకటించాలని, రాజీనామా చేసిన బీడీ కార్మికులకు కనీస పెన్షన్ పది వేలు ఇవ్వాలని అన్నారు. అలాగే ఆంక్షలు లేని జీవన భృతి కార్మికుల అందరికీ ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు జీఓ నెంబర్ 60ను అమలు చేయాలని అన్నారు. వారికి చట్టబద్ధత హక్కులు కల్పించాలని అన్నారు. జీఓ నెంబర్ 68 అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు సవరించాలన్నారు. ఆగస్టు 29చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మండల నాయకులు మధ్యవేణి చిన్న రాజన్న, జీపీ కార్మికురాలు పాల్గొన్నారు.

## అక్రమ డిప్యూటేషన్స్‌ను ప్రోత్సహిస్తున్న డీఈఓపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్రమ డిప్యూటేషన్‌లను ప్రోత్సహిస్తున్న డీఈఓపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం టీయూటీఎఫ్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారిగా నియామకమైనా నాటి నుంచి ఇప్పటివరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇచ్చినటువంటి మార్గదర్శకాలను ప్రక్కన పెట్టి, ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం ఇచ్చిన వెసులుబాటును అడ్డు పెట్టుకొని పైరవీ కారులకు పెద్ద పీట వేస్తోందని అన్నారు. వారి కనుసన్నుల్లోనే వారుకోరుకున్న చోటుకి, సర్దుబాటు పేరుతో బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. గత జూన్ నెలలో జిల్లా కేంద్రంలో ఉన్న క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయులు పనిచేయుట కోసం స్పష్టమైన విధానాలతో నోటిఫికేషన్ ఇచ్చి తరువాత నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా కాకుండా తనకు అనుకూలంగా ఉన్న వారికి నియమించారని అన్నారు. ఇటువంటి అక్రమ నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. డీఈఓ కార్యాలయంలో అనాధికారికంగా కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని, వారిని తిరిగి వారి పాఠశాలలకు పంపించాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని గాడిలో పెట్టాల్సిన డీఈఓ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. డీఈఓపై జిల్లా కలెక్టర్ తగు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు నాయకులు ఉన్నారు.

## బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా జాదవ్ అరవింద్

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సూర్యనగర్ సొకెర, గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్‌ను బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గుడిహత్నూర్ జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ ఒక ప్రకటనతో తెలిపారు. అదేవిధంగా కార్యకర్తలకు గుర్తింపునిస్తూ పదవులు ఇచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్, పతంగి బ్రహ్మానంద్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మండలం ఏర్పాటుపై కళాజాత ప్రదర్శన



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలంటూ చుట్టుపక్క గ్రామాల్లో కళాజాత బృందాలు ఆదివారం ఆటపాటలతో గ్రామస్తులను చైతన్య పరిచారు. మండల సాధన సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే మండలం జనాభా వివిధ వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఉన్నతికి ఉద్యోగులకు ఉపాధి తదితర సౌకర్యాలు కలుగుతాయని ప్రభుత్వ పాలన ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలియజేస్తూ కళా బృందాలు తమ ఆటపాటల ద్వారా ప్రజలకి అవగామన కల్పించారు. కజ్జర్ల, దేవాపూర్, పల్లి(కె), పల్లి(బి), లచ్చంపూర్, సకినాపూర్, అర్లి(కే) గ్రామాల్లో గత రెండు రోజులుగా జానపద పాటలు పాడుతూ ఆయా పల్లె ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలోబరంపూర్ మండల సాధన సమితి కన్వీనర్ బొల్లారం బాబన్న, వెంకట్‌రెడ్డి, కళాబృందం సభ్యులు ఎడ్ల ఆశన్న, భువనగిరి పెద్ద అశోక్, ముక్కెర దత్తు, చిన్న అశోక్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటర్ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్ ఎస్సీ కోటలోని ఎంపీసీ కేటగిరిలో-7 సీట్లు, బీసీ-1 సీటును భర్తీ చేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదివారం ప్రిన్సిపల్ సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి 12 గంటలలోపు బాసర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసిన వారికి అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు స్పాట్ అడ్మిషన్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శేటొపెల్లి నారాయణకు మంజూరైన రూ.32 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న చేతుల మీదుగా ఆదివారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ సర్కార్‌ను మళ్లీ గెలిపిద్దామని సర్పంచ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రతి గ్రామానికి ప్రతి ఇంటింటికి చేరుతున్నాయని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలుపుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు బి.రవి, మాజీ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎం.సత్తన్న, కార్యకర్తలు పి.భూమన్న, ఏ.గంగన్న, ఆర్ శ్రీను, కె.శ్రీను, బి.భూమన్న పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం



ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎల్.కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ఉండి ఓటు హక్కులేని వారు వెంటనే, ఆయా గ్రామాల్లో ఉన్న బీఎల్‌ఓల వద్ద ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే రానున్న ఎన్నికలలో ప్రతి ఓటరు తమ విలువైన ఓటును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ, జూనియర్ అసిస్టెంట్ ఫకీర నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

**నార్నూర్:** మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, మహగావ్ గ్రామంలో స్పెషల్ క్యాంపింగ్ డే సందర్భంగా ఆదివారం ఆసిఫాబాద్ డీఆర్ఓ కే సురేష్ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండల కేంద్రంలో 13, 14, 15, 16, తాడిహత్నూర్‌లో 1, 4 మహగావ్‌లో 18 నెంబర్ పోలింగ్ కేంద్రాల ఓటరు లిస్టులు పరిశీలించారు. బీఎల్‌ఓలతో ఎలక్షన్ ఫారం-6 ఏ విధంగా తీసుకోవాలి ఓటరు లిస్టులో ఉన్న తప్పు ఒప్పులు ఏవిధంగా సరిచేయాలో సూచించారు. గ్రామాల్లో అర్హులైన వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు లిస్టులో వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వారివెంట తహసీల్దార్ రాజలింగం, డీటీ అమృత్‌లాల్, రెవెన్యూ సిబ్బంది కవిత, నీల, శకుంతల, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

**తలమడుగు :** మండల కేంద్రంతో పాటు రుయ్యాడి, బరంపూర్, కజ్జర్ల గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆదివారం మండల తహసీల్దార్ రాజమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు పట్టికలో పేర్లు నమోదు చేసుకోవాలని, లేనియెడల దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన మండల యువతీ, యువకులను కోరారు. ఎన్నికలు సమీపిస్తూ ఉండటంతో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓటరు పట్టికలో తమ పేర్లు ఉన్నావో లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలని అన్నారు. తహసీల్దార్ వెంట సిబ్బంది సాయికుమార్, అంగన్‌వాడీ టీచర్ రాధా, అనసూయ ఉన్నారు.

## బీఆర్ఎస్‌లోకి బీజేవైఎం నాయకుడి చేరిక

**ఆదిలాబాద్‌టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందని నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జిల్పెల్లి అశ్విన్ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరమావధిగా పాటు పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి విశేష ప్రజాదరణ లభిస్తోందని అన్నారు. అందుకు అనుగుణంగానే భారీ ఎత్తున పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాతం శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాలు, షీ టీం సేవలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రేండ్లగూడ గ్రామంలో గల మదర్ తెరిసా చిల్డ్రన్ హోమ్‌లో ఆదివారం సైబర్ నేరాలు, షీ టీం సేవలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండవ ఎస్సై సర్కార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్‌లో ఫేస్‌బుక్, వాట్సాప్ ట్విట్టర్ ఆన్‌లైన్ బ్యాంక్ అకౌంట్ సేవలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసులను సంప్రదించాలని కోరారు. ఏఎస్సై ముత్యం సిబ్బంది పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-మందమర్రి



కార్మెల్ హై స్కూల్‌లో 1998-99 బి సెక్షన్ పూర్వ విద్యార్థుల 25 నంల సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని ఆదివారం ఆనంద ఉత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి దేశంలో నలుమూలల్లో స్థిరపడిన దాదాపు 25 మంది టీచర్స్ 45 విద్యార్థులు హాజరయ్యారు. విదేశాల్లో ఉన్న ఇద్దరు రాలేకపోయినప్పటికీ వీడియో కాల్‌లో మాట్లాడి వారి ఆనందాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి వారి అనుభూతులను పంచుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తమకు విద్యాబుద్దులు నేర్పించిన స్కూల్ కోసం 40 చైర్స్ విరాళంగా ఇచ్చి తమ ప్రేమను ఔన్నత్యాన్ని చాటుకున్నారు.

## ఇల్లు కూలి రోడ్డున పడ్డ వృద్ధురాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నివాసం ఉంటున్న ఇల్లు అకస్మాత్తుగా కూలి వృద్ధురాలు రోడ్డున పడ్డ సంఘటన జిల్లా కేంద్రంలోని హడ్కోకాలనీలో చోటుచేసుకుంది. వృద్ధురాలు పుల్లమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తాను నివాసం ఉంటున్న గూనపెంకుల ఇల్లుకు సంబంధించిన కర్రలు ఒకేసారి విరుగుతున్నట్టు శబ్దం రావటంతో వెంటనే అప్రమత్తమై తనతో పాటు తన మనవరాలను కూడా బయటికి తీసుకువచ్చింది. క్షణాల్లో ఇల్లు పూర్తిగా నేలమట్టం అయింది. సామాగ్రి చెడిపోవడంతో పాటు తాను రోడ్డున పడాల్సి వచ్చిందని కన్నీరు పర్యంత మయ్యారు. తన కూతురు, అల్లుడు అనారోగ్యంతో మరణించడంతో మనమరాలు హారికను తన వద్దఉంచుకుంటున్నానని తెలిపారు. కూలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండగా ఇల్లు కూలిపోవడంతో ప్రస్తుతం తినడానికి తిండి కూడా లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

## బీఎస్‌పీలో భారీగా చేరికలు



నవ తెలంగాణ-మందమర్రి

పట్టణంలోని దీపక్‌నగర్ 16వ వార్డు నుండి బహుజన్ సమాజ్ పార్టీలో ఆదివారం భారీ సంఖ్యలో మహిళలు యువకులు చేరారు. పట్టణ అధ్యక్షుడు చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ హాజరై మహిళలను యువకులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి 16వ వార్డు కమిటీ, మహిళా కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా తుంగపిండి రమేష్ మాట్లాడుతూ పార్టీ విధివిదానాలు వివరించి, వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్తామని ప్రజా సమస్యలపై ధృష్టి సారించి సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఆరె వరుణ్, సీనియర్ నాయకులు పులిపాక శ్రీనివాస్, చొప్పదండి అశోక్ పాల్గొన్నారు.

## గొల్లకుర్మల జోగు బియ్యం బోనాలు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని శిర్షా గ్రామంలో గొల్లకుర్మలు శ్రావణమాసాన్ని పురస్కరించుకొని జోగు ఎత్తడం, జోగు ఎత్తిన బియ్యంతో మల్లిఖార్జున స్వామికి బోనం అర్పించడం జరిగింది. వారి ఆచారం ప్రకారం తరతరాల నుండి వస్తున్న ప్రతి సంవత్సరం శ్రావణమాసం రెండో ఆదివారం ఈ కార్యక్రమాన్ని ఒగ్గుడోలు కళాకారులతో కలిసి జరుపుకుంటామని వారు పేర్కొన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం



రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా ముందుకెళ్తూ బీఆర్‌ఎస్‌ను గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బుక్య జాన్సన్ నాయక్ కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మొట్ట మొదటిసారిగా జన్నారం వచ్చిన సంధర్భంగా ఎంపీపీ మాదాడి సరోజన రవిందర్‌రావు ఇంట్లో పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు ఎంపీపీ సరోజన, ఇతర నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మండల ప్రజా ప్రతినిధులు, కార్య కర్తలతో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ కలలు కన్న తెలంగాణ రాష్ట్రంలో ఇతర పార్టీలకు ఎదురు లేకుండా భారీ మెజారిటీతో తనను గెలిపి చడానికి కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని, ఎలాంటి తగాదాలు ఉన్నా వాటిని పక్కన పెట్టి గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్దాం అన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు అయ్యే విధంగా సైనికుల్లా పని చేయాలని, ఖానాపూర్ నియోజకవర్గాన్ని గతంలో పాలకులు పట్టించుకోలేదని, తనను గెలిపిస్తే సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చి దిద్దు తామన్నారు. గ్రామ గ్రామాన కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, ఇతర పార్టీలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగాలన్నారు.

## డాడీస్ యాప్ వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డుపై జరిగే ప్రమాదాల నుంచి అత్యవసర సేవలు పొందడానికి రూపొందించిన డాడీస్ రోడ్డు వాహన ఆప్ ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో యాప్ ఉపయోగాలను వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఈ యాప్ అవసరమైన సేవలు అందిస్తుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ డాడీస్ రోడ్ డెకల్ వెహికల్ సేఫ్టి క్యూ ఆర్ కేవలం రూ.599కే జీవితకాలం వాలిడిటీ పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే యాప్ స్కాన్ చేస్తే కుటుంబ సభ్యులకు సమాచారం వెళ్ళిపోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ మొబైల్‌లో ఆప్‌డౌన్ లోడ్ చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాడీస్ రోడ్ సంస్థ ఆసిఫాబాద్ నిర్వాహకులు మడావి సతీష్, డిస్ట్రిబ్యూటర్స్ లక్ష్మణ్, నగేష్, వెంకటేష్, కాంతారావు పాల్గొన్నారు.

## బీఎంఎస్ కృషి ఫలితంగానే కార్మికులకు మెరుగైన వైద్యం

నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీఎంకేఎస్(బీఎంఎస్) కృషి ఫలితంగానే సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించుటకు హెల్త్ హిస్టరీ డిజిటలైజేషన్ చేయుటకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం కొరకు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కారం చేయాలని, మే 19వ తేదీన ఏసీఎంఓ ఏరియా హాస్పిటల్ గోదావరిఖని, మే 24 సింగరేణి వ్యాప్తంగా జనరల్ మేనేజర్లు, జూన్ 18 డైరెక్టర్ పాకి, ఆగస్టు 17వ తేదీన క్యాంప్ కార్యాలయం గోదావరిఖని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్ వినతి పత్రాలు అందజేసి డైరెక్టర్ పా తో సంప్రదింపులు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డైరెక్టర్ పా సానుకూలంగా స్పందించి త్వరలోనే డిజిటలైజేషన్ చేయుటకు ఆదేశాలు జారీ చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టు 26న సర్క్యులర్ జారీచేసిన సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- సమ్మెలో భాగంగా కూరగాయలు అమ్ముతూ నిరసన



నవతెలంగాణ-హాజీపూర్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ఆదివారం సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో రోడ్డుపై కూరగాయలు అమ్ముతు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఎఎన్ఎంలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అన్ని రకాల కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని, దీనికి బాధ్యత ప్రభుత్వమే వహించాలిసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.పద్మ, మంజుల కవిత, రాజేశ్వరి, సంధ్య, మీనా, రజిత, సుజాత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-జన్నారం



గ్రామాలలో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వినోద్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతగూడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ యువకులను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ తాము అందరూ 9 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో అన్యాయంకి గురయ్యామని, అందుకే కాంగ్రెస్‌లో చేరామని అన్నారు. మళ్ళీ బీఆర్ఎస్‌లో టికెట్ రాని ఎమ్మెల్యేని తీసుకోచ్చి కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, దీని కోసం తాము అందరం తీర్మానం చేస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ చింతగూడ గ్రామంలో రోడ్, డబుల్ బెడ్ రూమ్, దళిత బంధు పథకంలో దోపిడి చేశారని ఆరోపించారు. యువకులకు సరైన క్రీడా ప్రాంగణం లేకుండా పోయాయని, స్థానిక ఎమ్మెల్యే పాలనపైన విసుగు చెందిన యువకులు ఇవాళ రేఖా నాయక్‌ని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు అని తీర్మానం చేశారని తెలిపారు. అనంతరం యువకులకి వాలీబాల్ కిట్లని పంపిణీ చేసారు.ఈ కార్యక్రమం లో నాయకులు ఇమ్రాన్, రాగ, వంగపల్లి నరేష్, నందు, లక్ష్మణ్, శేఖర్, శ్రీను, భూమేష్, విక్కి, బన్నీ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికలవేళ రాష్ట్రంలో కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని గతంతో పోలిస్తే పార్టీలో టికెట్ల కోసం ఆశించే వారి సంఖ్య పెరిగిందని నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి అన్నారు. రాబోవు ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ తరపున పోటీచేసేందుకు నలుగురు అభ్యర్తులు టికెట్ కోసం ఆశిస్తున్నారన్నారు. ఎప్పటి నుండో పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తు జిల్లా కేంద్రంలో సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం ఉండి ఆదివాసి బిడ్డగా ప్రజల్లో పరిచయాలు ఉన్న తనకు అవకాశం ఇస్తే పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని అన్నారు. తనకే పార్టీ టికెట్ వస్తుందని పూర్తి నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం పార్టీ టికెట్ కోసం పలువురు దరఖాస్తు చేశారని అయితే సర్వేల ఆధారంగా టికెట్ కేటాయిస్తుందని తెలిపారు. ఎన్నికల వరకు మాత్రమే ప్రజల్లో ఉండి తర్వాత ప్రజలతో సంబంధాలు లేకుండా ఉండడం తనకు వర్తించదని పార్టీ అభివృద్ధి కోసం ప్రతిక్షణం కృషి చేస్తానని తెలిపారు. పీసీసీకి కూడా పరిస్థితిని వివరించానని తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం పోటీలో ఉండాలని కోరుకుంటున్న వారితో పోలిస్తే తనకు కొంత అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణ గెలుపుకు అవకాశం కల్పిస్తుందని అంతేగాని డబ్బులు గెలిపించవన్నారు. జిల్లా నాయకత్వం తన వెంటే ఉందని కార్యకర్తలు ప్రజలు తనకు అండగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకత్వం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# కవ్వాల్ ఒక చారిత్రాత్మక ప్రదేశం

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ ఒక చారిత్రాత్మక ప్రదేశమని ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవా దవలత రావు ముకాసి అన్నారు. ఆదివారం మండలంలోని కవ్వాల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల పాలగోరి ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ కోలువైఉన్న దేవతల ప్రదేశాలను పరిశీలించినారు. ఇది ఒక పవిత్రమైన చారిత్రాత్మక ప్రదేశమని ఆయిన కోనియడారు. పాలగోరి ప్రాంతానికి తూర్పు దిక్కున కోలువైఉన్న హనుమంతుని ప్రదేశానికి వెళ్లి అత్రం రాజా వంశ వారసుల గ్రామస్తులు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని వారితో పాటు హనుమాన్ దేవుడికి నైవేద్యం సమర్పించి , సాముహిక వన భోజనాల్లో పాల్గొన్నారు. 1864 సంవత్సరంలో కవ్వాల్ తాలుకాగా ఉన్నప్పుడు కోవ వంశ మొకాశీలకు నిజాం సర్కార్ వ్రాసి యిచ్చిన రాగి సనద్ గురించి వారికి వివరించినారు. ఆ ప్రదేశం యొక్క విశిష్టతను, ఆ ప్రాంతంలో కోలువైఉన్న దేవతామూర్తులకు సంబంధించిన వివరాలను ప్రతి సంవత్సరం అత్రం వంశ వారసురాలు అక్కడ కోలువైఉన్న దేవతలకు చేపడుతున్న పూజా విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ గల అత్రం వంశ వారసురాలు భూమి ఆక్రమణకు గురికావటం పవిత్రమైన వారి దేవతల ప్రదేశాలను, దేవతలను కోంత మంది ఆక్రమించుకోని ఆ భూమిని అక్రమంగా పట్టాలు చేయించటం చాలా బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వేంటనే స్పందించి ఆక్రమణకు గురైన భూమిని తిరిగి వారికి అప్పగించే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రం వంశ వారసురాలు ఆత్రం రాజు, అన్నారావు, జ్యోతిరాం, లచ్చు, గ్రామ పెద్దలు సిడం మోతిరాం, నైతం మాన్కు, ఆదివాసి సేన మండల అధ్యక్షులు దుర్వ యశ్వంత్‌రావు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం



నవతెలంగాణ-కాసిపేట

నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని లంబాడితాండ(కె), కొండాపూర్, మల్కేపల్లి, గట్రావుపల్లి, దేవాపూర్ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరాలను సందర్శించి శిబిరం నిర్వాహణను పరిశీలించారు. నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో చనిపోయిన వారి వివరాల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించి మార్పులు చేయాలని సూచించారు. దేవాపూర్ ఓరియంట్ కంపెనీ అధికారులు, యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించి కార్మికులందరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దీంతో పాటు పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శుల పని తీరు, సర్వీసును మూల్యాంకనం చేసి అర్హత గల వారికి నియామకపు ఉత్తర్వులు అందించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు, ఎంపీడీఓ అలీం, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీఓ నాగరాజు, ఓరియంట్ హెడ్ఆర్ కులకర్ణి, నాయకులు మడావి ఆనంతరావు, ఉప సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.

## ఐక్యమత్యంతో హక్కులు సాధించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



నేతకాని కులస్తులు ఐక్యమత్యంతో తమ హక్కులను సాధించుకోవచ్చని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కొత్తపల్లి గంగేష్, దూలై వెంకటేష్ అన్నారు. ఆదివారం నేతకాని మహర్ కుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేతకాని చైతన్య యాత్ర ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి ఉట్నూరు మండలం మీదుగా జన్నారం మండల కేంద్రంలో ముగిసింది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేతకాని కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్లో తప్పులు ఉన్నాయని వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరి చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న నేతకాని కుల సమస్యలు ఇప్పటివరకు మరుగున పడే ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయి విమర్శించారు. తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో దాదాపు 25 లక్షల మంది నేతకాని కులస్తులు ఉన్నారన్నారు. తమ ఓట్లను రాజకీయ పార్టీల నాయకులు వాడుకోవడమే తప్ప రాజకీయంగా ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు నేతకాని కులాన్ని పూర్తిస్థాయిలో గుర్తించి అధికంగా ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ రాజకీయ చైతన్య యాత్ర ప్రోగ్రాం కోకన్వీనర్ జాడి రాజేష్, నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాడి కేశవ్, ఇంద్రవెల్లి అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ భారతీయ బౌద్ధ మహాసభ మండల కార్యదర్శి గోప్నే ఆనంద్ రావు, దిలీప్ మోరే పాల్గొన్నారు.

## బీఎస్‌పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల అభివృద్ధి



నవతెలంగాణ-జన్నారం

బీఎస్‌పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల అభివృద్ధి సాధ్యమవుతుందనిఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. ఆదివారం, మన బిడ్డ మన భరోసా, అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపేట గిరిజన గ్రామంలో పర్యటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పేద ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందాలంటే బీఎస్పీ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలుపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం మీదున్న, మోజు రాష్ట్ర ప్రజలను అభివృద్ధి చేయడంలో లేదన్నారు. ప్రతి గిరిజన బిడ్డకు నాణ్యమైన విద్య అందాలంటే బీఎస్పీ పార్టీని గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు కుక్కరికారి రాజేష్, మండల అధ్యక్షుడు బుక్య రమేష్ నాయక్, నియోజకవర్గ నాయకులు సంజయ్, సతీష్, వినోద్, మారుతి పాల్గొన్నారు.

## ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కౌటాల

ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతిల ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి వచ్చారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం వారిని పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకొని అధైర్య పడకండని ధైర్యం ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, చింతలమానేపెల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, పార్టీ మండల అధ్యక్షుడు డబ్బుల వెంకయ్య, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, నాయకులు డబ్బ బాపు ఉన్నారు.

## విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఆదివారం కాసిపేట పోలీస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ మోసాలు, ఉమెన్ సేఫ్టీపై, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగారాం మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రతకి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అది మా బాధ్యత అని భరోసా కల్పించారు. అదే విధంగా పోలీస్ అధికారులకి పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్, పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సర్పంచ్ వొజ్జల మౌనీష్ సత్యనారాయణ వ్రతం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు సంతోష్, బాపు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ జైత్‌పూర్ 235, కిర్డీ 244, బెండారా 233 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో గల 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వచ్చే విధంగా చూడాలన్నారు. గ్రామంలో ఇప్పటివరకు ఓటు రాని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందిని కోరారు. ఆయన వెంట ఎంపీపీ విమలాబాయి, తహసీల్దార్ రహీమొద్దీన్ ఉన్నారు.

## మహాధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాను విజవంతం చేయాలని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్నలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ అనేక సమస్యలను పెండింగ్‌లో ఉంచడం సరి కాదని, ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ)ను నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ కమిటీ వేయాలన్నారు. జులై 1 నుండి మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. 2004కు ముందు నోటిఫికేషన్ల ద్వారా నియమకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ముంజం మల్లేష్, మండల కార్యదర్శి దుర్గం రాజలింగం, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సాత్పడి నర్సయ్య పాల్గొన్నారు.

## ఏజెన్సీ పోస్టులను గిరిజనులకు కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వం డీఎస్సీ ద్వారా చేపట్టబోయే ఉపాధ్యాయ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంత పోస్టులను గిరిజన అభ్యర్థులచే భర్తిచేయాలని అదివాసి టీచర్స్ అసోసియేషన్ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీ పోస్టులు, మైదాన ప్రాంత పోస్టులతో కలిపి మొత్తాన్ని మైదాన ప్రాంతంగా ప్రకటించడాన్ని వ్యతిరేఖంచారు. 1/70 చట్టాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేసి గిరిజనుల చట్టాలను రక్షిస్తామని చెబుతూనే ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులను మైదాన ప్రాంతంలో కలపడం వల్ల ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సుప్రీం కోర్టు 5వ షెడ్యూల్‌ను పరిగణలోకి తీసుకోకుండా జీఓ ఎంఎస్ 3ను కొట్టివేయడం, జరిగిందని పేర్కొన్నారు. తరువాత ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, గిరిజన సంఘాలు రివ్యూ పిటిషన్ వేవారని గుర్తు చేశారు. రివ్యూ పిటిషన్ పెండిట్లో ఉన్నందున తుది తీర్పు వెలువడే వరకు కండీషన్ అపాయింట్ మెంట్ పైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ పోస్టులను గిరిజనులకు కేటాయించి నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో గిరిజన ఉద్యోగ, పాధ్యాయులు, నిరుద్యోగులతో ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు.